# నాకీ శిక్ష చాలు! మణిపాత్రుని రామకృష్ణారావు

**హృదయం రగిలి సెగలు కక్కినా,
మనసు ముక్కలయి చెదిరినా
- ఆ శకలాల మధ్య శిథిలంలా మిగిలిన సాటి మనిషికి
మనం ఇవ్వగలిగిం దేమిటి?
పిడికెడు సానుభూతి!
కాని - ఆ సానుభూతి రావాలి అంటే మన మనసు,
మన హృదయం ఆ వేదనల చితిలోంచి బతికి
బయటపడి ఉండాలి కదా!**

ఆ వేళ ఆఫీసు పని తెమలక పోవడంతో బీచ్ చేరేసరికి పొద్దు పోయింది. హేమంతం ప్రవేశంతో షికారుకని వచ్చిన వాళ్ళు త్వరగా ఇంటి ముఖం పడుతున్నారు. జనం పలచగానే ఉన్నారు.

నేను ప్రతి రోజూ కూర్చునే స్థలానికి పోయి చతికిలబడ్డాను. సంధ్య వెలుగులో సముద్రం మనోహరంగా కనిపిస్తోంది. దూరంగా నౌకల మీద మెరుస్తున్న దీపాలు ఆట విడుపు కోసం ఆకాశం మీంచి సముద్రం మీద వాలిన తారల్లా ఉన్నాయి.

రోజూ సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి పోతూ బీచ్‌లో పొద్దు పోయేంత వరకూ కూచోటం నా దిన చర్యలో ఒక భాగమైంది గత పదిహేనేళ్ళుగా. నిర్లిప్తంగా గడిచిపోతున్న జీవితంలో - సముద్రానికి ఎదురుగా కూర్చుని ఏదో తెలియని మరో లోకానికి ప్రయాణం - చాలా హాయిగా ఉంటుంది.

యధాలాపంగా పక్కకు చూశాను. వాళ్ళిద్దరూ రోజూలానే కూర్చుని వాళ్ళ ప్రపంచంలో వాళ్ళున్నారు. కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. ఆమె ఒడిలో పల్లీలు తీసి నుతారంగా ఒలుస్తూ ఆ యువకుని నోటి కందిస్తోంది.

ప్రతి రోజూ ఆ యువతీ యువకులు బీచ్‌కి రావడం చూస్తున్నాను. ఓ పది రోజుల్నించీ. నాకూ, వాళ్ళకీ మధ్య పాతిక గజాల దూర ముంటుంది. ఇంచుమించుగా రోజూ కూర్చునే స్థలంలోనే కూర్చుంటారు. సాధారణంగా ఆమె కాస్త ముందుగా బస్‌లో వస్తుంది. అటు ఇటుగా ఓ అరగంట తేడాలో అతను స్కూటర్‌పైన వస్తాడు. అలాగే అతని కోసం ఆత్రంగా రోడ్డు వైపు చూస్తుంటుంది. వాళ్ళను అబ్జర్వ్ చేయడం నాకు అలవాటుగా మారిం దీ మధ్య.

చీకటి పడేదాకా ఒకర్నొకరు చూసుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ ఆ సాయంత్రం కోసమే రోజంతా బ్రతుకుతున్నట్లుగా ఉంటారు. వాళ్ళు వెళ్ళేంత వరకూ వాళ్ళను చూస్తూ నేనూ కూర్చునేవాడిని. ఒకరి చేయి ఒకరు పట్టుకుని నన్ను దాటుకుంటూ రోడ్డెక్కేవారు. రామకృష్ణా బీచ్ దగ్గర సిటీ బస్సెక్కేది ఆమె అతనికి వీడ్కోలు చెపుతూ.

ఆ కాస్సేపూ నా గుండె అరల్లో శిలల్ని చెక్కుతున్న ఉలి నవ్వడి చిత్రంగా ప్రతిధ్వనిస్తుంది.

ఒక సాయంత్రం బీచ్ నానుకుని ఉన్న పార్లర్‌లో కాఫీ తాగుతుంటే వాళ్ళిద్దరూ వచ్చి నా కెదురుగా కూర్చున్నారు. నన్ను చూసి పలకరింపుగా నవ్వారు. బహుశా రోజూ నన్ను చూస్తున్నారేమో బీచ్‌లో అనుకున్నాను మనసులో. ప్రతిగా చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను. వాళ్ళు స్నాక్స్ తీసుకుని కాఫీ తాగారు. చాలా హుషారుగా ఉన్నారు. చుట్టూ ఉన్న మనుషులు, పరిసరాల్తో మాకేం పని అన్నట్లుగా ధీమాగా కనిపించారు. లేచి వెళుతూ మరల నా వైపుకు ఒక చిరునవ్వు పారేశారు. ఆవేళ నుంచీ వాళ్ళ పట్ల నాకు ప్రత్యేకమైన ఆసక్తి, ఇష్టం ఏర్పడ్డాయి.

** ** ** **

ఒంట్లో నలతగా ఉండడం మూలాన వారం రోజులై ఆఫీసుకు వెళ్ళడం లేదు. దగ్గు తెర తెరలుగా వచ్చి గుండెల్ని పిండుతోంది. అయిదు పదులు దాటిన వయసు మొదటిసారిగా తన ప్రభావాన్ని చూపుతోంది. జీవితం చివరి మజిలీలో ఈ ఒంటరితనం భరించలేనిదిగా ఉంది. ఓ డాక్టర్ ఫ్రెండ్ రోజూ వచ్చి మందు లిచ్చి పోతున్నాడు. బీచ్‌కి వెళ్ళకపోవడంతో మనసంతా చికాకుగా ఉంది. ఓపిక తెచ్చుకుని ఒక రోజు నడిచి వెళ్ళాను. ఆ మెత్తని ఇసుక స్పర్శకు ప్రాణం లేచి వచ్చినట్లయింది. వెళ్ళి కూర్చున్నారు.

వాళ్ళిద్దరూ జ్ఞాపకం వచ్చి వచ్చారేమోనని చూశాను.

ఆమె ఒంటరిగా కూర్చునుంది.

అతను వచ్చినట్లు లేదు ఇంకా అనుకున్నాను మనసులో. చీకటి పడింది. అతను రాలేదు. ఆమె లేచి భారంగా అడుగులు వేస్తూ రోడ్డు దాటుతోంది. ఈ వేళెందుకని అతను రాలేదో? ఆమె ఇలా ఉసూరంటూ వెళ్ళిపోతుండడం నాకు నచ్చలేదు.

ఆ మరునటి రోజు కూడా ఆమె ఒంటరిగానే ఉంది. ఆమె కళ్ళల్లో అతను రాలేదనే బాధ లీలగా కనిపించింది నాకు. వరుసగా నాలుగు రోజుల నుంచి ఒంటరిగానే పొద్దు పోయే వరకు కూర్చుని, కూర్చుని వెళ్తుండటం చూశాను.

ఆమె నలా ప్రతి సాయంత్రం బాధించడానికి ఆ యువకుని మన సెలా ఒప్పిందో? కోపం వచ్చింది అతని మీద నాకు.

ఒకవేళ - మై గాడ్! అలా కాకూడదు. ఆ ఆలోచన ముల్లులా నా మనసును తొలిచేయడం మొదలెట్టింది! రోజూ వాళ్ళు కనిపించగానే నాలో కదిలే ఆ చిరు నవ్వడి ఇప్పుడు లేదు.

కాలం పూసిన లేపనంతో గుండె లోతులో ఇంకిపోయిన విషాదం కట్టలు తెంచుకునుంది నాలో.


రాజ్యలక్ష్మి! ఆమెలా ఏ స్త్రీ అన్యాయం కాకూడదు. రాజ్యలక్ష్మిని దక్కించుకోలేకపోయాను. అప్పటి నా నిస్సహాయ స్థితి, చేతకానితనం రాజ్యలక్ష్మి జీవితంలో నిప్పులు పోశారు.

కులం, మతం అనేవి మా ఇద్దరి మధ్యా అడ్డు గోడ లైనాయి. రహస్యంగా ఊరొదిలి పెళ్ళి చేసుకుందా మనుకున్నాం. భవిష్యత్తు మీద కొండంత ఆశతో నా మీద ఆమెకున్న అచంచలమైన నమ్మకంతో అయిన వాళ్ళందరినీ విడిచి ఆ అర్థరాత్రి పూట స్టేషన్లో వేచి ఉన్న నా దగ్గరికి వచ్చింది.

ఊరికి రెండు మైళ్ళ దూరంలో గుడ్డి దీపాల్తో నిద్ర పోతున్నట్లుగా ఉండే ఆ చిన్న రైల్వే స్టేషన్లో రాత్రి ఒకటి, పగలు ఒకటి పాసింజర్ బళ్ళు ఆగుతాయి మొక్కుబడిగా. ఆవేళ అర్థరాత్రి దాటాక రావలసిన ట్రైన్ రాలే దా స్టేషన్‌కు. పట్టాలు తప్పి ముందు స్టేషన్లో ఆగిపోయింది.

భళ్ళున తెల్లవారి పోయింది, కాస్సేపటికి - విషయం తెలిసి జనం అంతా స్టేషన్లో ఉన్నారు. మా చుట్టూ గుమిగూడి చోద్యం చూస్తున్నారు. వేటగాడికి జంటగా దొరికిపోయిన లేడి పిల్లల్లా ఉన్నాం ఇద్దరమూను. నలుగురు మనుషుల్ని వెంటపెట్టుకుని నన్ను బలవంతంగా ఈడ్చుకుపోయాడు మావయ్య అక్కడి నుంచి. తండ్రి మరణంతో తనూ, అమ్మా మేనమావ పంచన చేరాల్సి వచ్చింది. ఊళ్ళో తన పరువు పోయిందంటూ ఉగ్రుడైపోయాడు - నేను ఇల్లు కదలకుండా మనుషుల్ని కాపలా ఉంచాడు. పాపం అమ్మ కుళ్ళి కుళ్ళి ఏడ్చింది మావయ్య కెదురు చెప్పలేక.

వారం రోజుల తరువాత తెలిసింది - రాజ్యలక్ష్మి వాళ్ళు ఊరు వదిలి వెళ్ళిపోయారని. జనారణ్యంలో తిరిగే మృగం - మావయ్య - ఎంత పనైనా చేయగలడు. పిచ్చివాడిలా తిరిగాడుతను. రాత్రి, పగలూ ఆ స్టేషన్లో రాజ్యలక్ష్మిని



తలుచుకుంటూ నిశ్శబ్దంగా రోదించేవాడు తను.

తల్లి మరణించిన తరువాత ఆ ఊరొదిలి పెట్టేశాడు. రాజ్యలక్ష్మిని వెతుక్కుంటూ ఎన్నోచోట్ల తిరిగాడు సంవత్సరాల తరబడి. ఫలితం లేక పోయింది.

ఆకలి పీక నొక్కేందుకు ఉద్యోగం అవసరం అయింది తనకు. ఎన్నో పనులు చేశాడు ఇన్నాళ్ళుగా. ఆలోచనల్నించీ తేరుకుని చూశాను. ఆమె ఇంకా కూర్చునుంది. అన లేం జరిగిందో తెలుసుకోవా లనిపించి లేచి వెళ్ళాను. ఆమె ఎదురుగా నిలుచున్నాను.

మోకాళ్ళ మధ్య తలానించి ఏడుస్తోం దామె. నేను తటపటాయించాను ఆమెను పలకరించడానికి.

ఒక నిముషం తరువాత తలెత్తి నన్ను చూసింది - మొహం నిండా కన్నీటి చుక్కలు చారలుకట్టాయి.

"ఏమ్మా! ఏమైంది ?" అడిగాను.

బేలగా చూసింది.

"ఫర్వాలేదు... చెప్పు ఏమయిందో?"

ఎటువంటి సమాధానం వినవలసి వస్తుందోనని గుండె దడదడా కొట్టుకుంది.

"అతను... అతను... లేరండీ... నన్ను ఏకాకిని చేసి వెళ్ళిపోయారు..." చేతుల్లో మొహాన్ని దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

విషయం అర్థం కాలేదు నాకు. గుచ్చి గుచ్చి అడిగే చనువూ లేదు... చూస్తూ నిలుచుండిపోయాను.

రోజూ వాళ్ళకి పల్లీలు అమ్మే కుర్రాడు నన్ను చూసి దగ్గరికి వచ్చాడు.

"మీకు తెలియదా సార్! ఆ బాబు స్కూటర్ మీద వస్తూ బస్సు క్రింద పడిపోయాడు. ఈ రోడ్డు మీదే - వారం రోజులైంది." ఇంకా ఏదో చెబుతున్నాడు బొంగురు పోయిన గొంతుతో.

నా వంట్లో రక్తం హఠాత్తుగా గడ్డకట్టినట్లయింది. అచేతనంగా ఉండిపోయాను.

రాక్షసి తుపానులో ఛిన్నాభిన్నమైన నావలా కనిపిస్తుం దామె - ఆమెనే చూస్తూ ఉండిపోయాను. ఉప్పెనలా వస్తున్న కన్నీటిని ఆపుకోలేకపోయాను!

"అరుణా! అరుణా! నీ కోసం బీచి అంత వెతుకుతున్నాను. ఇంటికి వెళ్దాం పదమ్మా..." ఎవరో ఒకామె వచ్చి ఆమె ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని పైట చెంగుతో కన్నీళ్ళు తుడుస్తోంది.

"అమ్మా!" అంటూ ఆమెను చుట్టుకుని బిగ్గరగా ఏడుస్తోంది.

"పదమ్మా? ఇంటికి వెళ్దాం"

ఆ వచ్చింది ఎవరా అని కన్నీటి పొరల్లో నుంచి చూసిన నేను నిశ్చేష్టుడ నయ్యాను.

ఆమె.. ఆమె... రాజ్యలక్ష్మి...!

కాళ్ళ క్రింద భూమి రెండుగా చీలిపోతున్నట్లుగా ఉంది. నా శరీరం తీవ్రంగా కంపిస్తోంది.

పసి గుడ్డును అక్కున చేర్చుకున్నట్లుగా ఆమెను పట్టుకుని నడిపించుకుంటూ తీసుకుని వెళ్తోంది రోడ్డు వైపు.

గుండెల్లోని బాధ మండుతుంటే - ఆ ఇసుకలో కూలబడిపోయాను.

కడలి కడుపు చించుకుని ఉవ్వెత్తున లేచిన కెరటం ఒకటి ఒడ్డునున్న బండ రాళ్ళకు తగిలి తునాతునక లయింది. ★